క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద నూతనంగా నిర్మించిన దేవాలయం లో శ్రీ సద్దలక్ష్మీ, ఎర్రమల కంబగిరి స్వామి, గణపతి, అన్నపూర్ణేశ్వరి, నవగ్రహ విగ్రహాల తోపాటు ధ్వజ స్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన పూజా కార్యక్రమాలు బుధవారం ప్రాణ ప్రతిష్ట, స్వామి,అమ్మవార్ల కల్యాణంతో ఉత్సవాలు ముగిశాయి.

శివస్వాములకు బిక్ష ఏర్పాటు

డోన్ : పట్టణంలోని పాతపేట శివాలయంలో శివమాలదారులకు మహా శివరాత్రి పర్వదినం వరకు బిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దినేష్‌గౌడ్ తెలిపారు. మాజీ కౌన్సిలర్ టమటం లక్ష్మీదేవి, రామాంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో శివస్వాములకు బుధవారం బిక్ష ప్రారంభించారు. బిక్ష సౌకర్యాన్ని శివస్వాములందరూ వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

రేపు శివవరంలో రథసప్తమి వేడుకలు

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో ఈనెల 16న రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.15వ తేదీ రాత్రి భజన కార్యక్రమం, 16వ తేదీ స్వామివారికి అభిషేకం, అర్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేరోజు సాయంత్రం సామూహిక ఆదిత్య పారాయణము, సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

16న వాహన వేలం

డోన్ రూరల్ : పట్టణంలోని సెబ్ కార్యాలయంలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఈనె16న వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ ఎస్ఐ సోమశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వ్యక్తులు రూ. 3 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ట్యాంక్ మరమ్మతు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజినీర్

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ శిధిలా వస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేపట్టారు. ఈ మేరకు బుధవారం పనులను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. పనులు పూర్తవ్వగానే ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ తెలిపారు. అలాగే కాలనీలో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, భాస్కర్, రమేష్, మురళీ, వెంకటేశ్వర్లు, సుందర రాజు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి


ఆర్బీకే సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రెడ్డి

ప్యాపిలి: రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని మెట్టుపల్లిలో బుధవారం ఆయన రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్బీకేలో పని చేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలు రైతులకు చేరువయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆర్బీకే సిబ్బందిపై ఉందన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

బేతంచెర్ల: ప్రమాదాల కట్టడికి ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్ఐ శివ శంకర్ నాయక్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో లారీ, ఆటో, జీపు డ్రైవర్లు, యువకులకు రహదారులపై భద్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడప వద్దన్నారు. ప్రమాద సూచికలు పరిశీలించడమే కాకుండా, బ్రిడ్జిలు, మలుపులను గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


బనగానపల్లెలో రూ. 8 కోట్లతో నిర్మించిన ఫోర్‌లైన్స్ సెంట్రల్ లైటింగ్ సిస్టం రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యనిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. బుధవారం పట్టణంలోని బనగానపల్లె అవుకు మెట్ట నుంచి రూ.9.30 కోట్లతో ఆకుమళ్ల వరకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు, తమ్మడపల్లె గ్రామంలో రూ.61.80లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, సీసీ రోడ్డు, డ్రైన్స్‌తో పాటు పట్టణంలోని రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఫోర్‌లైన్స్ సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు ఇరుకైన రహదారి మూలంగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమయ్యేవారని, సీఎం జగన్ సహకారంతో రూ.8 కోట్లు మంజూరు చేయించి ఫోర్‌లైన్స్ ఏర్పాటుతోపాటు సెంట్రల్ లైటింగ్ సౌకర్యంతో మోడల్ టౌన్‌గా మార్చామని గుర్తు చేశారు. పెట్రోల్‌బంకు సర్కిల్ నుంచి కర్నూలు రోడ్డును కూడా మరో రూ.4 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పట్టణంలో రూ.22 కోట్లతో చేపట్టిన వందపడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తియ్యాయని, త్వరలో సీఎం జగన్‌తో ప్రారంభిస్తామని చెప్పారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా....

సీఎం వైఎస్ జగన్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ప్రతి పెల్లెలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయిన్స్ ఏర్పాటుతో పాటు ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు మంచి చేసిన సీఎం జగన్ కావాలో, అబద్దాపు హామీలను ఇస్తూ మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ నాయకులు కావాలో ప్రజలు ఓటు వేసే ముందు ఒక క్షణం ఆలోచించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ సుబ్బమ్మ, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, అత్తార్ జాహెద్, ఫైజ్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, వెంకట్రామిరెడ్డి, సిద్ధంరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బాలు, కంబగిరి, మధు, కోడూరు రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జీటీ వెంకట్రామిరెడ్డి, సీలిశ్రీనివాసులు, సురేష్, అలివుశేన్, తిరుపాల్, రామసుబ్బారెడ్డి, పెద్దన్న, యల్లయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌కుమార్ రెడ్డి, పీఆర్‌డీ ఈఈ నాగశ్రీనివాసులు, ఏఈలు హుస్సేన్, రమణ, ఈఓ ఖలీల్, యూనుస్ చాకలి సుబ్బారాయుడు, బాలరాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీకి మాత్రం అభివృద్ధి కనిపించడం లేదు!

బనగానపల్లె నియోజకవర్గాన్ని అంకితభావంతో అభివృద్ధి చేశామన, మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు. అయితే ఈ అభివృద్ధి పనులు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యేగా బీసీ ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ మూలంగా పట్టణంలో 3,200 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేకపోయామన్నారు. అయితే న్యాయమే గెలుస్తుందని, త్వరలో 3,200 మంది ఇళ్ల పట్టాలను పంపిణీతోపాటు గృహాలు సైతం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

కూరగాయల మండి మర్చంట్ దుకాణం ప్రారంభం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆవరణంలో బీకేఆర్ కూరగాయల మండి కమిషన్ మర్చంట్ దుకాణాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు కూరగాయల మహబూబ్‌బాషా, రెహ్మాన్, అల్తాఫ్, మురళీ మోహన్ రావు, ఖానిక్, మాబుసా, చాంద్‌బాషా, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామానికి చెందిన దివాకర్, మల్లేశ్వరి విద్యార్థులకు బుధవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. వసంత పంచమి సందర్భంగా తమ కుమారుడు సంతోష, కుమార్తె పల్లవికి స్థానిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయించిన సందర్భంగా హెచ్‌ఎం ఖలీల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు దివాకర్ తెలిపారు.

కనుల పండువగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట


స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నేత దండు వీరయ్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట ఎస్సీ కాలనీలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బుధవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కనుల పండువగా జరిగింది. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.10 లక్షలు, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.20 లక్షలతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేపట్టారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది పురోహితుల బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద రెడ్డి, సులోచన దంపతులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య తదితరులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు జెడ్పీ చైర్మన్‌కు ఆలయ కమిటీ సభ్యులు, ఎస్సీ కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు కామిని తిమ్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గొంగటి రామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంబటి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ బుక్కాపురంలో...

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ బుక్కాపురంలో బుధవారం వినాయక, సీతారామ, లక్ష్మణ,ఆంజనేయ, ధ్వజ స్తంభ, నాభిశిల ప్రతిష్ట, సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మునేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సీఐ ప్రీతం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమహేశ్వర్‌రెడ్డి, దాత ముల్లా ఇద్రూస్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బలరాముడు, రమణ, లక్ష్మన్న,గ్రామ సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే


అమ్మవారి హారతి స్వీకరిస్తున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామానుజన్, అర్చకులు ఘనస్వాతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తవంతుగా అమ్మవారి ప్రాకారం, మండపం, ఆలయ మాడవీధుల ఏర్పాటుకు రూ.2 కోట్ల వరకు విరాళాన్ని త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ మేరకు ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి


మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని, ఇతరులకు ఏ మాత్రం ఇబ్బంది కలిగించొద్దని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బుధవారం రాత్రి పట్టణంలోని పాతపేటలో ప్రజలతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రౌడీ షీటర్లుగా పేర్లు నమోదైన వారి కదలికపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైంలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవ్వరైనా ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయ పెట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ ఆల్బర్ట్ ఆధ్వర్యంలో భస్మబుధవారం పురస్కరించుకొని సాయంత్రం ఉపవాస ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫాదర్ ఆల్బర్ట్ మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు ఈ రోజు నుంచి మార్చి 29వ తేదీ వరకు ఉపవాస రోజులుగా పాటించి,ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపవాస ప్రార్థనలు చేయడం వల్ల క్రైస్తవ కుటుంబాల్లో ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ సంఘ పెద్దలు ప్రసాద్,మనోహర్, రేవతి, జాకోబు, సరోజసుందరం, ప్రేమీలారాణి, మంజులామణి, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన


పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న స్థలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన సొంత ఖర్చులతో నెలకొల్పుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ జయరాం, డీఈ రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్‌తో కలిసి విగ్రహం ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రెండు రైల్వేగేట్ల మధ్య ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించే సందర్భంలో అక్కడ తొలగించే అవకాశం ఉందన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడు, అమరజీవి పొట్టి శ్రీరాములుతో పాటు పాతబస్టాండ్‌లో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహాలను ఈ నెల 18వ తేదీలోపు మంత్రి బుగ్గనతో ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని సరస్వతీనగర్‌లో వెలసిన పసన్నభారతీమాత ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో మూల విగ్రహమూర్తికి క్షీరాభిషేకం, అమ్మవారికి షోడశోపచార తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మూడేళ్లు నిండిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

డోన్ టౌన్ : వసంత పంచమిని పురస్కరించుకొని పాఠశాలల్లో భక్తి శ్రద్ధలతో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్ర పటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా చిన్నారులకు అక్షరభ్యాసం చేశారు. గీతా యోగాసన సంఘం అధ్యక్షులు గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో ఎస్కేపీ హైస్కూల్లోని సరస్వతిమాత విగ్రహానికి సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

బేతంచెర్ల: వసంత పంచమి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాల కమిటీ సభ్యులు గుండగా గోపాలు, మద్దిలేటిస్వామి, లక్ష్మినారాయణ హెచ్ ఎంలు బాల వెంకట రమణలు విద్యార్థుల తల్లిదండ్రులతో హోమం నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

సర్వస్వతీ దేవికి ప్రత్యేక పూజలు

సంజామల: మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య, ఓబులేసు, వెంకట రమణ, పీడీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక సరస్వతీ శిశుమందిరంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం రామాంజనేయులు, పాఠశాల సిబ్బంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

విజయ డెయిరీ చెక్కుల పంపిణీ


పాడి రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని తమ్మడపల్లెలో విజయ డెయిరీ సంస్థ అమలు చేస్తున్న కల్యాణమస్తు పథకానికి సంబంధించి ఐదు మంది లబ్ధిదారులకు బుధవారం ఒక్కొక్కరికి రూ.5వేల చెక్కులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బనగానపల్లె యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాల ప్రభావం పెద్దగా లేనందున ఈ వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి కొండమీది గ్రామాలైన ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె, పిక్కర్లపల్లితాండా, మన్నేనాయక్‌తాండా, ఇస్రానాయక్ తాండా, మర్రికుంట తాండా, మంగంపేట, మంగంపేటతాండాలపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైతే రైతుల బోర్లను అద్దెకు తీసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మండలంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు, ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.8.50 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటికే రూ.5.50 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కంబగిరి స్వామి ఆలయంలో తాగునీటి కోసం రూ.40లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంక్‌ను నిర్మించారని, పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ఎంపీడీఓ మల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు,సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అభినయ్, పశువైద్యాధికారిణి భారతీదేవి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ భాస్కర్



అవుకు: అవుకు తహసీల్దార్‌గా ఎస్‌బీ భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తమవంతు కృషి చేస్తామని, సిబ్బందితోపాటు ప్రజలు సహకరించాలని కోరారు.

అదనపు ఎస్ఐగా సుబ్బారావు

డోన్ టౌన్ : పట్టణ పోలీసు స్టేషన్ అదనపు ఎస్ఐగా బుధవారం సుబ్బారావు పదవీ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ నగేష్‌ను కడప ట్రాఫిక్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో మైదుకూరులో పని చేస్తున్న సుబ్బారావును ఇక్కడికి వచ్చారు. బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన మర్యాద పూర్వకంగా పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి తన జాయినింగ్ రిపోర్టును అందించారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న కాటసాని

కోవెలకుంట్ల:కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో రూ. 10.67 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు టర్నింగ్ వరకు నిర్మించిన సీసీరోడ్డు, డివైడర్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్, గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలతోపాటు వివిధ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కునుకుంట్లలో అధికారుల బృందం పర్యటన


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామ పంచాయతీలో టీబీ ముక్త పంచాయతీ జిల్లా బృందం డాక్టర్ గంగాధర్, వినయ్, ఈశ్వర్, నర్సింహ, ఇమ్రాన్‌లు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు మందులు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. కునుకుంట్లలో టీబీ వ్యాధి నిరోధకాల్లో భాగంగా నిర్ణీత లక్ష్యాలను సాధించినందుకుగాను టీబీ ముక్త పంచాయతీ అవార్డుకు కునుకుంట్ల గ్రామ పంచాయతీ ఎన్నికయ్యిందని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ యమున తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హరికుమార్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి


దామోదరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్ రూరల్ : పట్టణంలోని నక్కిరామన్న భవనంలో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, ప్రభాకర్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, భాస్కర్, నాగరాముడు, సుబ్బరాయుడు, సోమన్న సుభాష్ తదితరులు పాల్గొన్నారు.